క్లుప్తంగా

ధర్నాను జయప్రదం చేయండి

ఖమ్మంమయూరిసెంటర్: టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలని, పేపర్ లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇందిరా పార్క్ వద్ద అఖిలపక్షం ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరెపాటి రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... నిరుద్యోగులందరికీ రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పీవైఎల్ రాష్ట్ర నాయకులు కోలా లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు ఉమాశంకర్, సహాయ కార్యదర్శి బేతంపుడి నాగరాజు, గుడిచుట్టు గోపి, శ్రీకాంత్, సబ్బీర్ పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఖమ్మం వైద్యవిభాగం: ఇటీవల మధిర రైల్వేస్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి(40) రైలు ప్రమాదంలో మృతి చెందగా, ఆయన మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. అయితే, ఆయన ఆచూకీ తెలియకపోగా, ఎవరూ రాకపోవడంతో పోలీసులు, వైద్యశాల సిబ్బంది సమక్షాన అన్నం సేవా ఫౌండేషన్ స్వాధీనం చేసుకుని సోమవారం బల్లేపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు నగదు వితరణ

నేలకొండపల్లి: నిరంతరం పేదల కోసం పనిచేసిన శాఖమూరి వెంకటనారాయణ ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, విజ్ఞాన కేంద్రం చైర్మన్ శాఖమూరి రమేష్ పిలుపునిచ్చారు. మండలంలోని గువ్వలగూడెంలో వెంకటనారాయణ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి రూ.15 వేల నగదును హెచ్ఎంకు అందించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంగూరి వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ కందుల వెంకటేశ్వర్లు, విద్యా కమిటి చైర్మన్ షేక్ ఆసిఫా, మాజీ సర్పంచ్ లిక్కి వీరబాబు, విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు ఈశ్వర ప్రగడ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులందరికీ స్థలాలు కేటాయించాలి

నేలకొండపల్లి: అర్హత కలిగిన ప్రతీ జర్నలిస్టుకు ఇంటి స్థలం కేటాయించి, ఇల్లు నిర్మించాలని జర్నలిస్టుల సంఘం జిల్లా నాయకుడు పోలంపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్‌కు సోమవారం ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గతంలో జర్నలిస్టులకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు జాతీయ రహదారి నిర్మాణం కోసం తీసుకున్నందున ప్రత్యామ్నాయంగా స్థలాలు కేటాయించాలన్నారు. నేలకొండపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మైశా శ్రీనివాసరావు, పీవీ.నాగిరెడ్డి, మామిడి ప్రవీణ్, పి.శ్రీనివాసరెడ్డి, నున్నా లక్ష్మణ్, మారేపల్లి రామదాసు, వడ్లమూడి వెంకటేశ్వర్లు, లిక్కి హనుమంతరావు, తెలగమళ్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా కిట్లు పంపిణీ

రఘునాథపాలెం: బోధకాలుతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం ద్వారా మంజూరైన కిట్లను సోమవారం మంచుకొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో పంపిణీ చేశారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దసరా
వినోద	బలగం
సాయిరాం	రుద్రుడు
ఆదిత్య	శాకుంతలం
శ్రీనివాస	రావణాసుర
సుందర్	విడుదల

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	18	బచ్చలికూర	2
వంకాయ	30		10
బెండకాయ	20	పాలకూర	3
పచ్చిమిర్చి	44		10
కాకర	36	చుక్కకూర	2
బీర	60		10
దొండ	18	తోటకూర	2
నాటుదోసకాయ	26		10
పొట్లకాయ	40	గోంగూర	2
చిక్కుడు	76		10
గోరుచిక్కుడు	46	మెంతికూర	5
క్యాబేజీ	16		20
క్యాలీఫ్లవర్	25	కొత్తిమీర	1
ఆలుగడ్డ	22		15
చామగడ్డ	50	పుదీన	1
క్యారెట్	30		15
క్యాప్సికం	56	-ఖమ్మం వ్యవసాయం	

జాగా ఉంటే కబ్జానే..!

అనుమతులు లేకుండానే నిర్మాణాలు
- ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్న వైనం
- 57వ డివిజన్‌లో కొందరి నిర్వాకం
- సొసైటీ పేరుతో ఆక్రమిస్తున్నారని ఆరోపణలు


గుట్టలను తొలగించి అక్రమంగా చేపట్టిన నిర్మాణాలు

ఖమ్మంమయూరిసెంటర్: పేదల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 58, 59 ఇప్పుడు కొంత మంది అక్రమణదారులకు వరంగా మారుతోంది. నగరంలో ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు అక్రమణదారులు దాన్ని కబ్జా చేయడమే కాక.. యథేచ్ఛగా ఆ స్థలంలో పక్కా భవనాలను నిర్మిస్తున్నారు. అనంతరం ఇంటి నంబర్ పొందడం, ఆ ఇంటిని 58 జీఓ కింద దరఖాస్తు చేసుకొని తమ పేర్లు, తమ బంధువుల పేర్లతో పట్టాలను పొందుతున్నారు. దీంతో నగరంలో ఈ రోజు కనిపించిన ప్రభుత్వ భూమి వారం రోజుల తర్వాత చూస్తే దానిలో భవనాలను నిర్మించి కనిపిస్తున్నాయి. ఇక ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన అధికారులు, అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని ఆరోపణలు ఉన్నాయి. దీంతో అక్రమణదారుల కళ్లు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు, గుట్టలపై పడ్డాయి. రమణగుట్టలో పెద్దపెద్ద రాళ్లు ఉన్న గుట్టలను ఆక్రమించుకునేందుకు కొందరు వ్యక్తులు వాటిని తొలగించే పనిలో పడ్డారు.

ఖాళీ జాగాలపై కన్ను..

నగరంలోని 57వ డివిజన్‌లో రమణగుట్ట, వికలాంగుల కాలనీ ప్రాంతాల్లో అక్రమణదారుల కళ్లు ఖాళీ జాగలపై పడుతున్నాయి. ప్రభుత్వ భూమి ఉందని తెలిస్తే చాలు అక్కడకు వెళ్లడం రాత్రికి రాత్రే పక్కా ఇళ్ల నిర్మాణం చేపట్టేస్తున్నారు. సర్వే నంబర్ 64లో వేలాది గజాల స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు తెలుస్తోంది. వారికి ఎలాంటి కాగితాలు, అనుమతులు లేకున్నా ఇళ్లను నిర్మించుకుంటున్నారు. గుట్టలను, రాళ్లను తొలగించి స్థలాన్ని ఆక్రమిస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ప్రభుత్వం ఇచ్చిన పట్టాల సంఖ్య కన్నా ఆక్రమణకు గురైన స్థలాల సంఖ్య ఎక్కువగా ఉంటుందని ఈ ప్రాంతంలో చర్చ సాగుతోంది. వికలాంగుల కాలనీలోని పెద్దపెద్ద రాళ్లున్న గుట్టను చుట్టు తొలచి కొత్తగా ఇళ్లను నిర్మించుకుంటున్నారు.

పర్యవేక్షణ కరువు..

నగరంలో ప్రభుత్వ భూములు, గుట్టలు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ భూములను పర్యవేక్షిస్తూ కాపాడాల్సిన అధికార యంత్రాంగం తమ పని కాదన్నట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నగరంలో అక్రమంగా జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించి అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం దీనిపై దృష్టి సారించడంలేదు. కేఎంసీ అనుమతులు లేకుండా నగరంలో ఎలాంటి నిర్మాణాలు జరగడానికి వీలు లేదు. కాని కొంత మంది అక్రమణదారులు ప్రభుత్వ భూమిని ఆక్రమించడమే కాక దానిలో పక్కా ఇళ్లను నిర్మిస్తున్నా.. అడ్డుకోకపోవడంపై చర్చ జరుగుతోంది. కాగా, 57వ డివిజన్‌లో అనుమతులు లేకుండా పక్కా ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంపై కేఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులను వివరణ కోరగా.. వాటిని పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి.. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు.

అంధత్వం లేని సమాజానికే 'కంటి వెలుగు'

- శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి అజయ్‌కుమార్


కార్మికుడికి కంటి అద్దాలు ఇచ్చి కరపత్రం చదివిస్తున్న మంత్రి అజయ్‌కుమార్


కాల్వొడ్డు వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ బాధ్యులను అభినందిస్తున్న మంత్రి

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం గాంధీచౌక్: కంటి చూపు బాగుంటేనే ఏ పనైనా చేసుకోగలమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ఈ విషయాన్ని గుర్తించి దృష్టి లోపాలను సరిచేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగును అమలుచేస్తోందని చెప్పారు. ఖమ్మం 23వ డివిజన్ శాంతినగర్ మున్సిపల్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటుచేసిన కంటి వెలుగు శిబిరాన్ని మంత్రి సోమవారం ప్రారంభించి మాట్లాడారు. మారిన జీవన విధానం, పని ఒత్తిడితో కంటి సమస్యలు ఎదుర్కొంటున్న వారు పరీక్ష చేయించుకోవాలని సూచించారు.

మసీద్‌కు విరాళం..

ఖమ్మం 40వ డివిజన్ శుక్రవారిపేటలోని మజీద్-ఏ-అస్తఫల్ మసీద్ అభివృద్ధి కోసం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ రూ.12 లక్షలు ప్రకటించారు. ఇందులో సీడీపీ నిధుల ద్వారా రూ.10 లక్షలు, పువ్వాడ ఫౌండేషన్ ద్వారా రూ.2 లక్షలను మసీద్ పెద్దలకు సోమవారం మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, డీఎంహెచ్ఓ మాలతి, వైద్యాధికారి ఎవాంజలిన్, సుడా చైర్మన్ విజయ్, కార్పొరేటర్ మక్బూల్, మార్కెట్ చైర్‌పర్సన్ శ్వేత, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు నాగరాజుతో పాటు కిరణ్, ఆశ్రిఫ్, తాజుద్దీన్, శంషుద్దీన్, షకీనా, జానీమియా పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీలో సమస్యలు పరిష్కరించాలి

గొర్రెల పంపిణీ పథకంలో సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపించాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం(జీఎంపీఎస్) నాయకులు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. దళిత బంధు మాదిరి యూనిట్ల కొనుగోలుకు అవకాశం కల్పించాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతలచెర్వు కోటేశ్వరావు, తుశాకుల లింగయ్యతో పాటు మొర్రిమేకల అమరయ్య, గజ్జి సూరిబాబు, నరేష్, మధు, రమేష్ పాల్గొన్నారు. కాగా, ఖమ్మం కాల్వొడ్డు శ్రీ సత్యనారాయణ సహిత వీరాంజనేయ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ నూతన కమిటీ బాధ్యులు మంత్రి అజయ్‌కుమార్‌ను కలవగా ఆయన అభినందించారు. కమిటీ చైర్మన్ బచ్చు మురళీకృష్ణ, డైరెక్టర్లు గోధుముల శ్రీనివాస్‌రావు, చల్లా సత్యనారాయణ, ఆకుల మల్లికార్జున్‌రావు, గర్నీ రవికుమార్, గండమల్ల సంగయ్య, పులిపాటి సంపత్, మిట్టపల్లి శ్రీనివాస్‌రావు, రంగరాజు ఊర్మిళ, పిల్లుట్ల మంజుల పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్యక్రమాలపై శిక్షణ


మాట్లాడుతున్న ఎంపీపీ మంగీలాల్

తిరుమలాయపాలెం: స్వచ్ఛభారత్ మిషన్ ఫేజ్ 2లో భాగంగా పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల అమలు తీరుపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు మండల అధికారులకు సోమవారం శిక్షణ తరగతులు ప్రారంభం అయ్యాయి. ట్రైనర్లు అనూఫ్, నాగేందర్ పారిశుద్ధ్య కార్యక్రమాల అమలుతీరును వివరించారు. ఎంపీపీ మంగీలాల్, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాం, ఎంపీఓ రాజేశ్వరీ, ఏఓ సీతారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాటికాపరులకు టీ షర్ట్‌లు


టీ షర్ట్‌లు అందజేస్తున్న మేయర్ నీరజ

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంలోని వైకుంఠ ధామాల్లో పనిచేస్తున్న జాంబవంతుడు సొసైటీ సేవా కమిటీ బాధ్యులకు మేయర్ పునుకొల్లు నీరజ రాంబ్రహ్మం సోమవారం టీ షర్ట్‌లు అందజేశారు. మేయర్ నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారికి ఆర్థికసాయంతో పాటు టీ షర్ట్‌లు అందజేశాక నీరజ మాట్లాడుతూ... అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించడమే కాక శక్తి మేరకు సేవా కార్యక్రమాలు చేపడుతున్న సొసైటీ బాధ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి బాలుతో పాటు పి.వేణు, ఏపూరి తరుణ్, గట్టికొండ చుక్కయ్య, కాశయ్య, పడిశాల వీరస్వామి, సైదులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కూసుమంచి: పేద ప్రజలకు ఇళ్లు మంజూరు చేసి సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారు మీనన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాలేరు అసెంబ్లీ ఇన్‌చార్జ్ బి.ఉపేందర్ మాట్లాడారు. డబుల్ బెడ్రూం పథకం ఆచరణలో విఫలం అయిందన్నారు. ఈ కార్యక్రమంలో పాలేరు అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, మండలాధ్యక్షుడు దుంపల సాయిచరణ్, చిన్నారి, జ్యోతి, మనెమ్మ, చందు తదితరులు పాల్గొన్నారు.

స్థలాలు కేటాయించాలని వినతి..

కామేపల్లి(కారేపల్లి): పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ కామేపల్లి తహసీల్దార్ కోట రవికుమార్‌కు గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో లబ్ధిదారులు వినతి పత్రం అందజేశారు. నాయకులు నరాటి చంద్రమోహన్ మాట్లాడుతూ.. మండల పరిధిలోని లింగాల రెవెన్యూ పరిధిలో కొత్తలింగాల గ్రామంలో సుమారు 4 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, పేదలను గుర్తించి వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

వరకట్నం వేధింపులపై కేసు

ఖమ్మంరూరల్: మండలంలోని తెల్దారుపల్లికి చెందిన వివాహితను కట్నం వేధిస్తున్న భర్తపై కేసు నమోదైంది. ఎస్సై వెంకటకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. ఏపీలోని చందర్లపాడుకు చెందిన పొన్నం రామారావుతో కొంతకాలం క్రితం తెల్దారుపల్లికి చెందిన సంధ్యకు వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు జన్మించాక, రామారావు మద్యానికి బానిసై అదనపు కట్నం తీసుకురావాలని ఆమె వేధిస్తున్నాడు. పెద్దమనుషుల సమక్షాన పంచాయితీ నిర్వహించడంతో కొద్దికాలం బాగానే ఉన్న ఆయన మళ్లీ వేధిస్తుండడంతో సంధ్య ఫిర్యాదు మేరకు రామారావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సోమవారం తెలిపారు.

ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోని బీఆర్ఎస్


మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

ఖమ్మంరూరల్: బీఆర్ఎస్ నాయకులకు కావాల్సింది అధికారమే తప్ప ప్రజాసంక్షేమం కాదని వైఎస్సార్ టీపీ నాయకుడు నంద్యాల రవీందర్‌రెడ్డి విమర్శించారు. పెద్ద తండా పరిధి సాయిగణేష్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ వైఎస్. రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయాన ఉమ్మడి ఏపీలో ప్రజాసంక్షేమ పాలన ఎలా సాగిందో ప్రజలందరికీ తెలిసిందేనన్నారు. కాగా, చీమలపాడు ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల తమ పార్టీ అధ్యక్షురాలు షర్మిలపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

తిరుమలాయపాలెం: మండలంలోని గోల్‌తండా పరిధిలోని జింకలగూడెం మసీదులో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని మాజీ రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ చావా శివరామకృష్ణ బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేష్‌రెడ్డి ప్రారంభించారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి విందును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు సైదా, ఫైయాజ్ తదితరులు పాల్గొన్నారు.

చెట్టు నరికిన వారిపై చర్య తీసుకోవాలి


నరికిన చెట్టును చూపిస్తున్న వాకర్స్

ఖమ్మంమయూరిసెంటర్: పెవిలియన్ మైదానంలో పదేళ్ల వయసు కలిగిన చెట్టును నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ కమిటీ అధ్యక్షుడు, కార్పొరేటర్ బుడిగం శ్రీనివాస్ అధికారులను డిమాండ్ చేశారు. గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ఇష్టానుసారంగా భారీ వాహనాలను తీసుకొచ్చారని, వాహనాలకు అడ్డు వస్తుందని గేటు పక్కన ఉన్న చెట్టును నరకడం దారుణమన్నారు. వాహనాల రాకపోకల వలన విద్యుత్ వైర్లు తెగాయని, దీంతో మైదానంలో లైట్లు వెలగడం లేదన్నారు. ఎగ్జిబిషన్ నిర్వహణ వలన వాకర్స్, క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు.

పంచాయతీ కార్యదర్శుల నిరసన

నేలకొండపల్లి: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యూలరైజేషన్‌పై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవటంతో పంచాయతీ కార్యదర్శులు సమ్మె కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం కార్యదర్శులు నిరసన చేపట్టారు. నల్లబ్యాడ్జీలతో ఆయా పంచాయతీ కార్యాలయాలకు విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు బైరం దినేష్‌కుమార్ మాట్లాడారు... జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేస్తూ జీవో విడుదల చేయాలన్నారు. మరణించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలకు కారుణ్య నియమకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అర్హులైన సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు ప్రమోషన్లు కల్పించాలని, 317 జీఓతో నష్టపోయిన కార్యదర్శులకు న్యాయం చేయాలన్నారు. ఈ నిరసనలో పలువురు జేపీఎస్‌లు ఉన్నారు.

కంటివెలుగు శిబిరం ప్రారంభం


శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ జమాలారెడ్డి

నేలకొండపల్లి: అంధత్వ రహిత సమాజమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ కె.జమలారెడ్డి అన్నారు. మండలంలోని కోనాయిగూడెం ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్య శిబిరాన్ని సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ సునీత, బోదులబండ వైద్యాధికారులు డాక్టర్ గీత, డాక్టర్ రాధాకృష్ణ, ఉప సర్పంచ్ వడ్లమూడి నర్సయ్య, వార్డు సభ్యులు జంగం లక్ష్మినారాయణ, కార్యదర్శి బోళ్ల వీరబాబు, పీహెచ్ఎన్ కె.వాణి, ఏఎన్ఎంలు పద్మ, ఆబేదా, గ్రామ దీపిక కొమ్మినేని పుష్పావతి, అంగన్‌వాడీ టీచర్ నాగమణి, ఆశ కార్యకర్త బేబి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే వికాసం


హిమబిందును సన్మానిస్తున్న దృశ్యం

కామేపల్లి(కారేపల్లి): చదువుతోనే వ్యక్తిలో మానసిక వికాసం కలుగుతుందని సామాజిక సేవకురాలు అడపా హిమబిందు అన్నారు. సోమవారం మండల పరిధిలోని తాళ్లగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో హిమబిందుకు సన్మానం చేశారు. పాఠశాల గదులు పాడైపోవడంతో హిమబిందు సొంత ఖర్చులతో గదులను పునర్నిర్మాణం చేపట్టి ఆధునీకరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పుచ్చకాయల సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు విద్యాసాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలపై అవగాహన

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీ ఉద్యోగులకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం కొత్త బస్టాండ్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గిరిసింహరావు, ఖమ్మం డిపో సీఐ రామయ్య, కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి భాస్కర్


నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఖమ్మంరూరల్: పేదల పక్షపాతి దండి భాస్కర్ అని ఆయన ఆశయ సాధనకు కార్యకర్తలు కృషి చేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. సోమవారం మండలంలోని ఏదులాపురంలో జరిగిన భాస్కర్ వర్ధంతి సభలో భాస్కర్ స్తూపం వద్ద పలువురు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ. మౌలానా, దండి. సురేష్, మిడకంటి చినవెంకటరెడ్డి, అజ్మీరా రామ్మూర్తినాయక్, పుచ్చకాయల సుధాకర్, కమలాకర్, శేషగిరిరావు, తెలంగాణా ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.4 లక్షల విరాళం

ఖమ్మంరూరల్: మండలంలోని గోళ్లపాడులో నిర్మించనున్న కంఠమహేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సోమవారం రూ. 4లక్షలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే మానవాళికి ప్రశాంతత కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కళ్లెం. వెంకటరెడ్డి, జెడ్పీటీసీ ఏ.వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీర్‌గైబ్‌షావలీ బాబా ఉర్సు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంలోని శుక్రవారపేటలో పీర్‌గైబ్‌షావలీ బాబా ఉర్సు మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల అనంతరం సేవకులు తాజ్‌బాబా ఇంటి నుండి గంధం, పంఖా, ఖందిల్‌ను ప్రదర్శనగా తీసుకెళ్లారు. తుమ్మలగడ్డ మసీదు, శుక్రవారపేట, రిక్కాబజార్, శివాలయం మీదుగా దర్గాలో చేర్చగా, పెద్దసంఖ్యలో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.


గంధం, ఖందిల్‌తో బయలుదేరిన భక్తులు

పెద్దాస్పత్రిలో వ్యర్థాల గుట్టలు..

- ఎప్పుడొస్తుందో తెలియని కార్పొరేషన్ ట్రాక్టర్
- దుర్గంధంతో తిప్పనితిప్పలు


ఆస్పత్రిలో పేరుకుపోయిన వ్యర్థాలు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయి. సమయానుసారంగా వాటిని తరలించకపోవటంతో వాటి నుండి దుర్గంధం వెదజల్లుతోంది. సాధారణంగా ఆస్పత్రిలోని వ్యర్థాలను ఏ రోజుకు ఆరోజు పారిశుద్ధ్య సిబ్బంది ఆస్పత్రిలోని ఒక ప్రదేశానికి చేర్చుతారు. అయితే కార్పొరేషన్ నుంచి నిత్యం ట్రాక్టర్ ద్వారా వాటిని తరలించాల్సి ఉంటుంది. అందుకుగాను ఆస్పత్రి నుంచి కొంత మొత్తంలో చెల్లిస్తారు. అయితే అధికారుల అజమాయిషీ లేకపోవటంతో ట్రాక్టర్ ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. వారికి కుదిరిన సమయంలో వచ్చి వెళ్తుండటంతో ఇక్కడ రోజుల తరబడి వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దీంతో వాటి ద్వారా దుర్గంధం వెదజల్లుతోంది. వాటి నుండి వచ్చే వాసన ఆస్పత్రి మొత్తానికి వ్యాప్తి చెందుతుంది. అసలే ఆస్పత్రికి వ్యాధులకు గురైన వారు వస్తుంటారు. వ్యర్థాలు సమయానుసారం తరలించకపోవటంతో వాటి ద్వారా ఏఏ వ్యాధులు వ్యాపిస్తాయోనని ఆస్పత్రికి వచ్చే వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు.